# స్నేహమేరే జీవితం

"మమ్మీ!.. వచ్చే ఆదివారం మా ఆరోక్లాసు పిల్లల నందర్నీ - గండిపేట తీసుకెతారట... పిక్నిక్!.. రేపు ఏభైరూపాయలు తీసుకురమ్మన్నారు మా టీచర్!"-స్కూలు నుంచి వస్తూనే పుస్తకాల సంచీ 'టీపాయ్' మీద పెడుతూ చెప్పింది స్వప్న.

"వాళ్లందరితో కలిసి - ఆ స్కూలు బస్సులో కూరుకుపోయి, నువ్వేం వెళ్ళఖ్ఖర్లేదు... ఇంతోటి గండిపేటా నువ్వు చూడకపోవు! ముందు ఆ 'డ్రస్సు' మార్చుకుని, కాళ్లూ చేతులూ కడుక్కునిరా... ఉప్మా చేశాను... తిందువుగాని!" - అప్పటిదాకా టీవిలో సినీమా చూస్తున్న శ్యామల, టీవి ఆఫ్ చేసి వంటింట్లోకి నడిచింది.

స్వప్నకి ఉక్రోషం ముంచుకొచ్చింది...

"నాకేంవద్దు! నన్ను పిక్నిక్‌కి పంపిస్తేనే తింటాను!.. టీచర్‌కి పేరు కూడా ఇచ్చేశాను... తెలుసా!" అంది.

"ఎవర్నడిగి ఇచ్చావు పేరు? అయినా నీకు అంతగా ఆ గండిపేట చూడాలని వుంటే డాడీకి చెప్తాన్లే! మనం ముగ్గురం కలసి ఓ ఆదివారం ఎప్పుడైనా - మన ఎ.సి.కార్లో హాయిగా వెళ్లొద్దాం!" -

సరిగా అదే సమయంలో ఆఫీసునుంచి వచ్చిన సాగర్ భార్యమాటలు విన్నాడు.

కళ్లు తుడుచుకుంటున్న కూతుర్ని చూశాడు...

"హాయ్ బేబీ!" అంటూ పలకరించాడు...

కానీ, తండ్రివైపు చూడనైనా చూడకుండా, స్వప్న విసురుగా తన గదిలోకి వెళ్లిపోయింది.

"ఏం జరిగింది శ్యామలా! బేబీ ఎందుకలా వుందీ?" - అడిగాడు సాగర్...

జరిగిన విషయమంతా భర్తకు చెప్పింది శ్యామల.

"ఓస్! ఈ మాత్రందానికి దాన్ని ఏడిపించాలా? మనకి మగపిల్లాడైనా, ఆడపిల్లయినా అదొక్కతే కదా! దానిముచ్చట కాదంటావా?" - మందలింపుగా అన్నాడు సాగర్.

"అదికాదండీ! 'పిక్నిక్' అంటే క్లాసు పిల్లలు ఏ వందమందోవస్తారు!... వాళ్లతో వచ్చే ఏ ఇద్దరు ముగ్గురు టీచర్లో - ఈ మందనంతా జాగ్రత్తగా చూసుకోగలరా చెప్పండి? ఆటల పేరుతో, అక్కడ వీళ్లు ఏ దెబ్బలైనా తగుల్చుకుంటే - అప్పుడు బాధపడేది మనమేకదా?"

భార్యమాటలు విన్న సాగర్ తేలిగ్గా నవ్వేశాడు.

"అలాంటి భయాలు పెట్టుకుంటే – అసలు మనం పిల్లల్ని పెంచలేం తెలుసా? అయినా ఈ వయసునించే మనం వాళ్లకి స్వేచ్ఛనివ్వాలి శ్యామలా!... పంజరంలో చిలకల్లాగా కాకుండా – ఆకాశంలో పక్షుల్లాగా వాళ్ళని ఎగరనివ్వాలి... అప్పుడే ఈ సమాజాన్నీ, ప్రపంచాన్నీ వాళ్లు అర్థం చేసుకోగలుగుతారు. పైగా ఇలాంటి విహారయాత్రల పేరుతో పదిమందితోనూ కలసిమెలసి తిరిగితే– వాళ్లల్లో ఐకమత్యం, స్నేహభావం ఏర్పడతాయి!" – అంటూ భార్యకు నచ్చ చెప్పి, బేబీ గదిలోకి నడిచాడు సాగర్...

అక్కడ మంచం మీద, అడ్డంగా పడుకుని తలగడల మధ్య తలదాచుకున్న స్వప్న భుజం మీద అప్యాయంగా చేయి వేశాడు.

"నువ్వు 'పిక్నిక్' కి వెళుతున్నావ్ రా!... ఇదిగో... యాభై రూపాయలు... రేపు స్కూల్లో మీ టీచర్‌కి ఇచ్చెయ్... ఇంకో యాభై నీ దగ్గరవుంచుకుని – నీకిష్టమైంది కొనుక్కో" అంటూ వందనోటు ఆమె చేతిలో వుంచాడు.

స్వప్న లేచి కళ్లు తుడుకుంది. "అయ్ లవ్ యూ డాడీ!" – అంటూ తండ్రి మెడచుట్టూ చేతులు వేసి – అతని బుగ్గమీద ముద్దు పెట్టుకుంది.

ఆరోతరగతి రెండు సెక్షన్లనించీ మొత్తం యాభైమందికి పైగా పిల్లలు 'పిక్నిక్' కి వచ్చారు. అందరూ ఒకరినొకరు పరిచయం చేసుకున్నారు. కులాలూ, మతాలూ, బీదా గొప్పా– అనే తారతమ్యాలన్నీ మరచిపోయి అందరూ ఆడుకున్నారు... పాడుకున్నారు...

వాళ్ళతో వచ్చిన డ్రిల్లు మాస్టారి పర్యవేక్షణలో కొంతమంది మగపిల్లలు చెరువులోదిగి ఈతకొట్టారు. ఇంకొంతమంది పిల్లలు అక్కడి చెట్లు ఎక్కి కాయలు కోశారు.

స్వప్నకూడా ఓ మామిడి చెట్టు ఎక్కి – దాని చిటారు కొమ్మనున్న కాయను అందుకోబోయింది... ఆ కొమ్మ హఠాత్తుగా విరిగిపోవటంతో – స్వప్న, నిలదొక్కుకోలేక, క్రిందనున్న చెరువులో పడిపోయింది. అది చూసిన పిల్లలందరూ ఒక్కసారిగా ఆందోళనతో కేకలు పెట్టారు...

ఆ క్షణంలో అక్కడే చెరువులో ఈతకొడుతున్న 'బి' సెక్షన్ జోసెఫ్ – అది చూశాడు. నీళ్లల్లో ఊపిరందక కొట్టుకుంటున్న స్వప్నను గబగబా చేరుకుని – తన చేయి అందించి ఒడ్డుకి లాక్కొచ్చాడు... స్వప్నకి ప్రాణాపాయం తప్పినందుకు అందరూ ఆనందించారు. జోసెఫ్ సాహసాన్నీ, సమయస్ఫూర్తినీ టీచర్లు అభినందించారు...

"నా సెక్షన్ కాకపోయినా, నా ప్రాణాలు కాపాడావ్! సమయానికి నువ్వే అక్కడ వుండి నన్ను రక్షించకపోయుంటే– ఆ నీళ్ళల్లో ఊపిరాడక నేను చనిపోయేదాన్ని... అప్పుడు

మా అమ్మా, నాన్న నా కోసం ఎంత ఏడ్చేవాళ్లో!" - జోసెఫ్ చేతులు పట్టుకుని కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ చెప్పింది స్వప్న.

"ఎంతగా ఏడ్చేవాళ్లో నాకు తెలుసు చెల్లీ!.. ఎందుకంటే... ఏడాదిన్నర క్రితం క్రిస్మస్ పండక్కి నేనూ, చెల్లీ, మా అమ్మా, నాన్నా అందరం నాగపట్నంలో మా బంధువులింటికి వెళ్లాం! ఆ మర్నాడు, సముద్ర స్నానం చేస్తుంటే - హఠాత్తుగా సముద్రం పొంగింది. ఏం జరుగుతోందో తెలిసే లోగానే - కెరటాలు భూతాల్లాగా మా మీదకు వచ్చేశాయి. మా'డాడీ' నన్ను ఎత్తుకుని ఒడ్డుకి పరుగెత్తుకొచ్చారు - కానీ, అమ్మమాత్రం మా చెల్లాయిని పట్టుకోలేకపోయింది.!" - జోసెఫ్ చెప్తుంటే - అతని కళ్లల్లో సముద్రాన్నే చూసింది స్వప్న.

"అంటే... నీ చెల్లెలు..."

"అదే 'సునామీ'... అది నా చెల్లెల్ని ఎత్తుకుపోయింది... అప్పుడు మా అమ్మా, నాన్నా ఎంతగా ఏడ్చారో నేను కళ్లారా చూశాను" జోసెఫ్‌కి కన్నీళ్లు ఆగలేదు.

"ఊరుకో జోసెఫ్!... ఇక నుంచి నేను నీకు చెల్లెల్ని... సరేనా?" - అతని కన్నీళ్లు తుడుస్తూ చెప్పింది స్వప్న.

★★★

"చూశావా శ్యామలా!.. విహార యాత్రల వల్ల ఒక్కోసారి ఎలాంటి అనుభూతులు కలుగుతాయో? స్వప్నకి ఓ అన్నయ్య వుంటే బాగుండునని నువ్వు అస్తమానూ అంటూంటావ్! ఇప్పుడు ఆ కోరిక తీరింది కదూ?" జరిగిన సంగతంతా టీచర్ల ద్వారా తెలుసుకున్న సాగర్, శ్యామలకు వివరించి అడిగాడు...

"అవునండీ!... 'పిక్నిక్' వల్ల మీరన్నట్టు ఐకమత్యం, స్నేహభావం పెరగటమే కాదు...! అనుబంధాలు కూడా ఏర్పడతాయి. ఇకనించీ ఆ జోసెఫ్‌ని మన బిడ్డలా చూసుకుందాం... రేపే వాళ్లింటికి వెళ్లి, అతని తల్లితండ్రులకు కృతజ్ఞతలు చెప్పివద్దాం!" తృప్తి నిండిన కళ్లతో చూస్తూ అంది శ్యామల.....

(ఆంధ్రప్రదేశ్
జూలై, 2006)